## క్లుప్తంగా

### ఓపన్ టెన్త్, ఇంటర్ దరఖాస్తు గడువు పెంపు

మదనపల్లె సిటీ: ఓపన్ స్కూల్ ద్వారా పది, ఇంటర్మీడియట్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు గడువు ఈనెల 30 వరకు పొడిగించినట్లు జెడ్పీ ఉన్నత పాఠశాల హెడ్‌మాస్టర్ ఎం.సుబ్బారెడ్డి, అసిస్టెంట్ కోఆర్డినేటర్ పి.మహమ్మదఖాన్ తెలిపారు. విద్యార్థులు పూర్తి వివరాలకు 8121852786, 9490714919కు సంప్రదించాలని కోరారు.

### అక్టోబర్ 3లోపు పరీక్ష ఫీజు చెల్లించాలి

పీలేరు : ఇంటర్మీడియట్‌కు సంబంధించి 2023 మార్చిలో జరిగిన పబ్లిక్ పరీక్షలు, అంతకుముందు జరిగిన పరీక్షల్లో ఫెయిల్ అయిన విద్యార్థులు 2024 మార్చిలో జరిగే పరీక్షలకు హాజరయ్యేందుకు అక్టోబర్ 3వ తేదీ లోపు పరీక్ష ఫీజు చెల్లించాలని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వై. వెంకటరెడ్డి తెలిపారు. స్థానిక జూనియర్ కళాశాలలో పరీక్ష ఫీజు చెల్లించడం తోపాటు తరగతులకు కూడా హాజరు కావచ్చునని తెలిపారు. వివరాలకు కళాశాలలో సంప్రదించాలని కోరారు.

### 28న తిరువణ్ణామలైకు ప్రత్యేక బస్సు సర్వీసులు

పీలేరు రూరల్ : ఈ నెల 28న పీలేరు నుంచి తిరువణ్ణామలైకు ప్రత్యేక బస్సు సర్వీసులు నడపనున్నట్లు డిపో మేనేజర్ బండ్లకుమార్ తెలిపారు. పౌర్ణమిని పురస్కరించుకుని భక్తుల అరుణాచలం గిరిప్రదక్షిణ సౌకర్యార్థం బస్సు సర్వీసులు నడుపుతున్నట్లు తెలిపారు. పీలేరు తోపాటు సదుం, కలకడ, కలికిరి, గర్నిమిట్ట నుంచి బస్సులు పంపుతున్నట్లు చెప్పారు. ఆసక్తిగల భక్తులు తమ సీటు రిజర్వేషన్ చేసుకోవాలని కోరారు. వివరాలకు మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ కె.వి. రమణ 7893152748 నెంబర్‌కు సంప్రదించాలని కోరారు.

### ఎన్ఎంఎంఎస్ దరఖాస్తుకు గడువు నేడు

పెద్దతిప్పసముద్రం: నేషనల్ మీన్స్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్) పరీక్షా దరఖాస్తుకు చివరి రోజు సోమవారం అని ఎంఈఓ నారాయణ తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం ఎంఈఓ మాట్లాడుతూ ప్రతిభావంతులైన ఎంతో మంది విద్యార్థులకు ఆర్థిక స్థోమత లేనందున ఉన్నత విద్యకు దూరమవుతున్నారని భావించిన ప్రభుత్వం 2008లో ఈ ఎన్ఎంఎంఎస్ పథకాన్ని ప్రారంభించిందన్నారు. ఇప్పటికే ఈ పరీక్షల్లో సత్తా చాటిన విద్యార్థుల బ్యాంకు ఖాతాలకు 9వ తరగతి నుంచి ఇంటర్ పూర్తయ్యే వరకు ప్రతియేటా ప్రోత్సాహక నగదును జమ చేస్తోందన్నారు.

### వైభవంగా వెంకన్న పవిత్రోత్సవం



పూజా కార్యక్రమంలో వేదపండితులు, భక్తులు

తంబళ్లపల్లె: మండలంలోని కోసువారిపల్లెలో వెలసిన శ్రీప్రసన్న వెంకటరమణస్వామి ఆలయంలో టీటీడీ ఆధ్వర్యంలో రెండు రోజులుగా స్వామివారి పవిత్రోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. ఆదివారం ఆగమ అడ్వైజర్ మణికంఠ బట్టాచార్యులు, ప్రధాన అర్చకులు క్రిష్ణ ప్రసాద్‌బట్టార్, రమేష్‌లు స్వామికి ప్రత్యేక అలంకరణ చేశారు. చతుష్టార్చన , స్నపనతిరుమంజనం, ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేసి భక్తులకు దర్శనం కల్పించి తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ మునిచంగల్‌రాయుడు, ఇన్‌స్పెక్టర్ దిశాంత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### జూదరుల అరెస్ట్

పెద్దమండ్యం: మండలంలోని వెలిగల్లుకు సమీపంలో జూదం జరుగుతున్నట్లు అందిన సమాచారం మేరకు సిబ్బందితో వెళ్లి దాడులు నిర్వహించినట్లు ఎస్ఐ రామాంజనేయుడు తెలిపారు. ఈ దాడుల్లో నలుగురు జూదరులను ఆదివారం అరెస్ట్ చేశామన్నారు. వీరి నుంచి రూ.7500 నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు నలుగురిపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు. ఎక్కడైనా జూదం నిర్వహించినా, నాటుసారా తయారీ, విక్రయాలు చేసినా కఠినచర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

### ఇంటింటికీ వెళ్లి వైద్య పరీక్షలు



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న అమృత

వాల్మీకిపురం: పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో ఆదివారం ఎంఎల్‌హెచ్‌పిలు, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు వలంటీర్లతో కలసి ఇంటింటికి ఆరోగ్య రక్ష కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటిని సందర్శించి, ఇంట్లో ఉన్న వారికి బిపి, షుగర్, జ్వరం, జలుబు, తదితర వాటిని పరీక్షించి, మందులు, మాత్రలు అందించారు. అనంతరం ఎంఎల్ హెచ్‌పి అమృత మాట్లాడుతూ విలేజ్ హెల్త్ క్లినిక్, ఫ్యామిలీ డాక్టర్ ద్వారా వైద్య బృందం ప్రాంతాలవారీగా ప్రజల ఇంటి వద్దకు వచ్చి వైద్య పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు.

# ఆనందం..ఆహ్లాదం.. ఆటవిడుపు

- ఎంపీ, ఎమ్మెల్యే, మాజీఎమ్మెల్యే చొరవతో అందుబాటులోకి వచ్చిన పార్క్
- పిల్లలకు ఆటవిడుపు, పెద్దలకు విశ్రాంతి
- రూ.20 లక్షలతో పార్క్ దిన దినాభివృద్ధి



శ్రీ కాశీవిశాలాక్షి ఉద్యాన వనం



పచ్చదనంతో కళకళలాడుతున్న దృశ్యం

పీలేరు రూరల్ : దినదినాభివృద్ధి చెందుతున్న పీలేరు ప్రజల చిరకాల వాంఛ రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి వెంకట మిథున్‌రెడ్డి, పీలేరు ఎమ్మెల్యే చింతల రామ చంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యే జి.వి. శ్రీనాథరెడ్డి కృషితో నెరవేరింది. ఎన్నో ఏళ్లుగా పీలేరు పట్టణంలో పిల్లల ఆట విడుపుకు, పెద్దల విశ్రాంతికి, వాకింగ్ చేసుకోవడానికి పార్కు లేకపోవడంతో చాలా నిరుత్సాహంగా ఉండేవారు. తమ కల నెరవేరడానికి ఎవరు చొరవ చూపుతారో అని ఎదురు చూసే పరిస్థితి. ఇలాంటి తరుణంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు ఎంపీపీ కంభం సతీష్‌రెడ్డి, జెడ్పీటీసీ ఎ.టి. రత్నశేఖర్‌రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ కడప గిరిధర్ రెడ్డి, సర్పంచ్ డాక్టర్ హబీబ్‌బాషా, ఎంపీ పీఆర్‌వో ఉదయ్‌కుమార్, నాయకులు ఆనంద్ ప్రత్యేక చొరవ చూపి పార్క్ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు.

**రూ. 20 లక్షలతో అభివృద్ధి..**

పీలేరు పట్టణం నడిబొడ్డున కోటపల్లె జిల్లా పరిషత్ బాలికల పాఠశాల ఎదురుగా సర్వే నెంబరు 493లో రెండెకరాల స్థలం పార్క్ కోసం కేటాయించారు. ఎంపీ, ఎమ్మెల్యే ప్రత్యేక చొరవతో పార్క్‌కు కావాల్సిన స్థలాన్ని అభివృద్ధి చేశారు. సుమారు రూ. 20 లక్షలతో ఈ స్థలంలో పెద్దలకు అనుగుణంగా వాకింగ్ ట్రాక్‌లు, విశ్రాంతి బల్లలు ఏర్పాటు చేశారు. ఆహ్లాదకర వాతావరణం నింపడానికి వివిధ రకాల ఆకర్షణీయమైన పూల మొక్కలు, పచ్చదనం నింపేలా స్పాంజ్ గ్రాస్ ఏర్పాటు, చిన్న చిన్న ఫంక్షన్లు నిర్వహించుకోవడానికి ఓపెన్ ఆడిటోరియం ఏర్పాటు చేశారు. ఈ పార్క్ అందుబాటులోకి వచ్చి గత ఆరు నెలల నుంచి ఆహ్లాదాన్ని పంచుతోంది.

**హర్షం వ్యక్తం చేస్తున్న పట్టణవాసులు..**

అన్ని వసతులతో కూడిన పార్క్‌ను శ్రీ కాశీవిశాలాక్షి ఉద్యానవనం నామకరణంతో ఏడాది క్రితం రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి చేతుల మీదుగా ప్రారంభించారు. దీంతో పిల్లల ఆటవిడుపుకు, పెద్దల వాకింగ్‌కు, విశ్రాంతికి ఎంతగానో ఈ పార్క్ ఉపయోడపుడుతుండంతో హర్షం వ్యక్తం చేస్తున్నారు. కుటుంబాలతో పార్క్‌కు వెళ్లి తియ్యని అనుభూతి పొందుతున్నారు.

#### పీలేరు అభివృద్ధే ధ్యేయం



పీలేరు పట్టణం అభివృద్ధే మా ధ్యేయం. ఇప్పటికే ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే చింతల రామ చంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యే జి.వి. శ్రీనాథ రెడ్డిల సహకారంతో పార్క్ అభివృద్ధి చేసి పట్టణ వాసుల చిరకాలవాంచ తీర్చడం జరిగింది. పట్టణాన్ని అన్ని హంగులతో మరింత అభివృద్ధి చేయడానికి తమ వంతు కృషి చేస్తాం.

**- జి.వి. రాకేష్‌రెడ్డి, యువ పారిశ్రామికవేత్త**

#### పార్క్ అభివృద్ధికి కృషి



కాశీవిశాలాక్షి ఉద్యాన వనం అభివృద్ధికి కృషి చేస్తాం. ఇప్పటికే ఎంపీ, ఎమ్మెల్యే సహకారంతో పార్క్‌లో చాలా సౌకర్యాలు కల్పించడం జరిగింది. రూ. 5 లక్షలు పంచాయతీ నిధులతో టైల్స్ ఏర్పాటు చేయడం జరిగింది. తాటునీటి సౌకర్యం కల్పించడానికి ఆర్‌వో ప్లాంటు, మరుగుదొడ్లు ఏర్పాటు చేయడానికి కృషి చేస్తాం.

**- డాక్టర్ హబీబ్‌బాషా, సర్పంచ్, పీలేరు**

#### కొత్తగా ఓపెన్ జిమ్, మ్యూజికల్ లైట్స్



పార్క్‌లో కొత్తగా ఓపెన్ జిమ్, మ్యూజికల్ లైట్స్, యోగా శిక్షణ ఏర్పాటు చేయాలని నిర్ణయించడం జరిగింది. త్వరలో ఎంపీ, ఎమ్మెల్యేల సహకారంతో కార్యరూపం దాల్చడానికి కృషి చేస్తాం. ఇప్పటికే పట్టణ ప్రజలను ఆకట్టుకుంటున్న పార్క్‌లో మరిన్ని సౌకర్యాలు కల్పించి ఆహ్లాదాన్ని నింపడానికి కృషి చేస్తాం.

**- ఉదయ్‌కుమార్, ఎంపీ పీఆర్‌వో, పీలేరు**

#### మహిళలకు రక్షణ



వాకింగ్ చేసే మహిళలకు దొంగల నుంచి రక్షణ లభించినట్లయింది. గతంలో వాకింగ్ చేయాలంటే రోడ్డు పక్కన వెళ్లాల్సి వచ్చేంది. దీంతో భద్రత ఉండేది కాదు. అయితే పీలేరులో పార్క్ ప్రారంభించడంతో ఇక్కడ వాకింగ్ చేసుకోవడానికి అవకాశం కల్గింది. ఎలాంటి భయం లేకుండా మహిళలు వాకింగ్ చేసుకోవచ్చు.

**- మహిత, మాజీ ఎంపీపీ, పీలేరు**

### విస్తృతంగా సేవా కార్యక్రమాలు

కలికిరి: మానవత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో విస్తృతంగా సేవా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు ఆ సంస్థ కలికిరి శాఖ చైర్మన్ రత్నశేఖర్ రెడ్డి అన్నారు. ఆదివారం కలికిరి ఇందిరమ్మకాలనిలోని సంస్థ కార్యాలయంలో మండల స్థాయి సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద విద్యార్థులకు చేయూత, మొక్కలు నాటడం, రక్తదాన శిబిరాలు నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. మరిన్ని సేవా కార్యక్రమాలకు శ్రీకారం చుట్టనున్నట్లు తెలిపారు. సభ్యుల అభిప్రాయాలు, సలహాలు తీసుకున్నారు. ఈ మేరకు తీర్మానాలు చేశామన్నారు. కార్యక్రమంలో సంస్థ మండల శాఖ క్రియాశీలక సభ్యులు మధుసూదన్‌రెడ్డి, సభ్యులు సహదేవరెడ్డి, సురేంద్రరెడ్డి, చాముండేశ్వరయ్య, ఉత్తమరెడ్డి, శ్రీనివాసులు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### రెడ్డెమ్మతల్లికి ప్రత్యేక పూజలు



అమ్మవారి ఎదుట వరపడిన మహిళలు

గుర్రంకొండ: మండలంలోని చెర్లోపల్లె గ్రామంలో వెలసిన రెడ్డెమ్మతల్లి ఆలయం ఆదివారం భక్తుల రద్దీతో కిటకిటలాడింది. ఈసందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజామునే అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. సంతానం కోసం మహిళలు అమ్మవారి ఎదుట వరపడ్డారు. భక్తులు మొక్కులు చెల్లించి పూజలు నిర్వహించారు. పలువురు భక్తులు ఆలయంలో అన్నదానం చేశారు. హిందువులతో పాటు మస్లింలు పెద్ద ఎత్తున ఆలయానికి తరలివచ్చి పూజలు నిర్వహించడం గమనార్హం.

## ప్రధాన పార్టీలకు దీటుగా బీజేపీ బలోపేతం



సమావేశంలో మాట్లాడుతున్న సాయిలోకేష్

మదనపల్లె : బీజేపీకి జిల్లాలో మంచి భవిష్యత్తు ఉందని, రానున్న సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్రంలోని ఇతర ప్రధానపార్టీలకు దీటుగా అన్నివిధాలుగా సంసిద్ధం చేసి నాయకులు, కార్యకర్తలందరి సహకారంతో గెలుపే లక్ష్యంగా పనిచేస్తానని రాజంపేట పార్లమెంటరీ బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిలోకేష్ అన్నారు. ఆదివారం పట్టణంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో జిల్లా విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. సాయిలోకేష్ అధ్యక్షతన తొలిసారిగా జరిగిన విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశానికి రాష్ట్ర బీజేపీ ప్రధాన కార్యదర్శి బిట్రా శివనారాయణ, జిల్లా ఇన్‌చార్జ్ చంద్రమౌళి ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. జిల్లాలో సంస్థాగతంగా పార్టీని బలోపేతం చేయడం , ప్రధానమంత్రి నరేంద్రమోదీ జన్మదిన పక్షోత్సవాల సందర్భంగా జరుగుతున్న సేవాపక్వాడ కార్యక్రమాలు, బూత్ స్వశక్తికరన్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ప్రవాసి యోజన కార్యక్రమంపై సమీక్ష, ఇతర అంశాలపై విస్తృతంగా అవగాహన కల్పించారు. సాయిలోకేష్ మాట్లాడుతూ..... సామాన్యుడి నుంచి సంపన్నుడి వరకు అనేక సంక్షేమ పథకాలను కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో తీసుకువచ్చారన్నారు. వీటిపై ప్రజల్లో విస్తృత ప్రచారం కల్పించాలన్నారు. సెప్టెంబర్ 28,29,30 తేదీల్లో బూత్ స్వశక్తికరన్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా అన్ని బూత్‌లలో బూత్‌కమిటీలు ఏర్పాటుచేయడమే కాకుండా అన్ని మండలాల్లో మండల, మోర్చా కమిటీలు పూర్తిస్థాయిలో నియామకం చేయాలన్నారు. రాయలసీమ జోనల్ ఇన్‌చార్జ్ బిట్రా శివనారాయణ మాట్లాడుతూ... ప్రజాక్షేత్రంలో ప్రజల సమస్యలపై ఉద్యమించి, తద్వారా ప్రజల మనస్సును గెలుచుకుని, వారి మద్దతు పొందడం ద్వారా రాష్ట్రంలో పార్టీని అధికారంలోకి తీసుకువచ్చేందుకు బీజేపీ శ్రేణులు కృషి చేయాలన్నారు. సమావేశంలో జిల్లా బీజేపీ పూర్వ అధ్యక్షుడు డాక్టర్.ఏ.వి.సుబ్బారెడ్డిని ఘనంగా సన్మానించి, పార్టీకి ఆయన అందించిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి నాగోతు రమేష్‌నాయుడు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పి.రమేష్‌నాయుడు, రఘురామిరెడ్డి, జాతీయ మైనారిటీ కమిషన్ సలహాదారు షబ్బీర్‌అహ్మద్, పులినరేంద్రకుమార్ రెడ్డి, వై.సురేష్‌రాజు, శ్రీనివాస్‌యాదవ్, బండిఆనంద్, భగవాన్, ఎల్లంపల్లె ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

### ఆర్థికసాయం కోసం వేడుకోలు



మల్లికార్జున(ఫైల్)

తంబళ్లపల్లె: ఓ నిరుపేద యువకుడు రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి వేలూరు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. దాతల ఆర్థిక సాయంకోసం వేడుకుంటున్నాడు. వివరాలిలా.. తంబళ్లపల్లె మల్లికార్జున (28) తల్లి మృతి చెందడంతో ప్రైవేట్ డ్రైవర్‌గా పనిచేస్తూ వృధాప్యంలోని తండ్రిని, చదువుకుంటున్న తమ్ముడిని పోషిస్తున్నాడు. నాలుగురోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. కోమాలోకి చేరుకున్నాడు. స్నేహితులు వేలూరు ఆసుపత్రికి తరలించారు. అక్కడి డాక్టర్లు చికిత్సకు రూ.5లక్షల వరకు ఖర్చు అవుతుందని చెప్పారు. స్థోమతలేని అతను దాతల ఆపన్న హస్తంకోసం ఎదురుచూస్తున్నాడు. ఫోన్ పే నం 7993783127, బ్యాంకు ఖాతా నెం 35244950137, ఐఎఫ్‌సీ ఎస్‌బీఐఎన్0012727కు సాయం చేయాలన్నారు.

### పూర్వ విద్యార్థుల సమ్మేళనం

తంబళ్లపల్లె: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1992–93 విద్యాసంవత్సరంలో పదోతరగతి చదివిన విద్యార్థులు ఆదివారం అపూర్వ సమ్మేళనం నిర్వహించారు. స్థానిక పాఠశాలలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించి అప్పటి గురువులు హెచ్ఎం సిద్ధారెడ్డి, టీచర్లు వెంకటరమణ, బిరామ్‌సాబ్, నారాయణలను శాలువలతో సత్కరించి పాదపూజ చేశారు. అనంతరం గత జ్ఞాపకాలను గుర్తించుకుని ఆనందాన్ని పంచుకున్నారు. పాఠశాలలో విద్యార్థులకు ఏర్పాటు చేసుకు ఆర్‌వో ప్లాంట్‌కు చుట్టు గ్రిల్స్ ఏర్పాటుకు రూ.25వేలు అందజేశారు. సహచర పూర్వ విద్యార్థి ఖాదర్‌బాషా మృతి చెందడంతో అతని కుటుంబానికి రూ.50 వేలు ఆర్థికసాయం అందజేశారు. పాఠశాల అభివృద్ధికి తమ వంతు సాయం చేస్తామన్నారు.

## టౌన్‌బ్యాంకు అభివృద్ధికి సహకరించాలి

**– బ్యాంక్ పర్సన్ ఇన్‌చార్జ్ శ్యామ్‌ప్రకాష్‌రెడ్డి**



మాట్లాడుతున్న బ్యాంక్ పర్సన్ ఇన్‌చార్జ్ శ్యామ్‌ప్రకాష్‌రెడ్డి, సీఈఓ పీ.వి.ప్రసాద్

మదనపల్లె : టౌన్‌బ్యాంకులో ఋణాలు తీసుకున్న ఖాతాదారులు తమ కంతులను సకాలంలో చెల్లించి బ్యాంకు అభివృద్ధికి సహకరించాలని బ్యాంక్ పర్సన్ ఇన్‌చార్జ్, డివిజనల్ కో–ఆపరేటివ్ అధికారి ఎం.శ్యామ్‌ప్రకాష్‌రెడ్డి కోరారు. సీటీఎంరోడ్డులోని టౌన్ బ్యాంక్‌ప్రధాన కార్యాలయంలో ఆదివారం మదనపల్లె కో–ఆపరేటివ్ టౌన్‌బ్యాంక్ 99వ వార్షిక మహాజనసభ సమావేశం జరిగింది. బ్యాంక్ పర్సన్ ఇన్‌చార్జ్ శ్యామ్‌ప్రకాష్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో బ్యాంక్ సీఈఓ పీ.వి.ప్రసాద్ వార్షికనివేదిక సమర్పించారు. 31.3.2023తో అంతమైన 2022–23 ఆర్థికసంవత్సరానికి బ్యాంక్ డిపాజిట్లు రూ.86కోట్ల75లక్షలుగా ఉన్నాయని, అప్పులు 58కోట్ల70 లక్షలుగా పేర్కొన్నారు. సభ్యుల షేర్ల ధనం రూ.2కోట్ల47లక్షలు ఉంటే, బ్యాంకు వ్యాపారధనం రూ.104 కోట్ల89 లక్షలుగా ఉందన్నారు. 24–06–1924లో ప్రారంభమైన మదనపల్లె కో–ఆపరేటివ్ టౌన్‌బ్యాంక్ ప్రస్తుతం 99 సంవత్సరాలు పూర్తిచేసుకుని 100వ సంవత్సరంలోకి అడుగుపెట్టిందన్నారు. 24–06–2024కు వందేళ్లు పూర్తవుతాయన్నారు. ప్రస్తుత ఆర్థికసంవత్సరానికి రూ.1కోటి89 లక్షల 92వేలు స్థూల లాభం సంపాదించిందన్నారు. అందులో 49 లక్షల1వెయ్యి ఆదాయపు పన్ను చెల్లించగా, రూ.1కోటి40 లక్షల 91వేలు నికరలాభం ఆర్జించిందన్నారు. ప్రస్తుతం నూతన రిజర్వ్‌బ్యాంక్ నిబంధనల ప్రకారం ప్రతి త్రైమాసిక అంతానికి నిరర్థక ఆస్తులకు అనుగుణంగా కేటాయింపులు జరపాల్సి ఉందన్నారు. దీంతో ఋణవసూలు విషయంలో బ్యాంకు కఠినంగా వ్యవహరించాల్సి వస్తోందన్నారు. అలాగే బంగారంపై జారీచేసే ఋణాలు రూ.2లక్షలకు పైబడి ఉంటే వాటిని నెలసరివాయిదాలుగా చెల్లించాలని, అలా చెల్లించకుంటే నిరర్థక ఆస్తిగా గుర్తించాలని రిజర్వ్‌బ్యాంకు కఠిననిబంధన విధించిందన్నారు. వాణిజ్యబ్యాంకులకు ఎలాంటి షరతులు లేకుండా బంగారు నగలపై ఎంత మొత్తమైనా ఋణాలు మంజూరుచేసే స్వేచ్ఛ ఉందన్నారు. ఇలాంటి వివక్షతో కూడిన కఠిన నిబంధనల వల్ల పట్టణ సహకార బ్యాంకుల్లో బంగారు నగలపై ఋణాలు తీసుకున్న ఖాతాదారులు ఇబ్బంది పడుతున్నారన్నారు. బ్యాంకులో రూ.2లక్షలు పైబడి బంగారు ఋణాలు తీసుకున్న వారు క్రమం తప్పకుండా నెలసరి కంతులు చెల్లించాలని, లేని పక్షంలో త్వరితగతిన చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సి ఉంటుందన్నారు. సమావేశంలో మేనేజర్లు సుధారాణి, జయచంద్రనాయుడు, రవిచంద్రారెడ్డి, రాధిక, రాజశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

## వేగంగా జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే

పీలేరు : రాష్ట్ర ప్రభుత్వం ప్రజారోగ్యమే ధ్యేయంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే కార్యక్రమం మండలంలో చురుగ్గా జరుగుతోంది. మండలంలోని తలపుల, రేగళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో ప్రతి ఇంటికి వెళ్లి ప్రజల ఆరోగ్యంపై ఆరా తీస్తున్నారు. వైద్య ఆరోగ్య సిబ్బంది, గ్రామ వలంటీర్లు క్షుణ్ణంగా ప్రజల ఆరోగ్యం గూర్చి అడిగి తెలుసుకుని, గుర్తించిన ఆరోగ్య సమస్యలు నమోదు చేస్తున్నారు. ఈ నెల 30 నుంచి జరిగే జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలకు తరలించడానికి సమాయత్తం చేస్తూ ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు.

## హెడ్మాస్టర్లు పని సంస్కృతిని పెంచుకోవాలి

**–ఎస్ఎస్ రాష్ట్ర పరిశీలకురాలు కల్పన**




సమావేశంలో మాట్లాడుతున్న ఎస్. కల్పన

కురబలకోట: హెడ్మాస్టర్లు పని సంస్కృతిని పెంచుకుని పాఠశాలల అభివృద్ధితో పాటు విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు పాటుపడాలని సర్వ శిక్ష (ఎస్ఎస్) రాష్ట్ర పరిశీలకురాలు ఎస్. కల్పన అన్నారు. మండలంలోని అంగళ్లు గోల్డన్‌వ్యాలీ కళాశాలలో అనంతపురం, సత్యసాయి, కడప, కర్నూల్ జిల్లా యూపీ స్కూళ్లకు చెందిన హెడ్మాస్టర్లకు నాయకత్వ లక్షణాలపై ఆరురోజుల పాటు నిర్వహించిన శిక్షణ ముగింపు సమావేశంలో ఆమె మాట్లాడారు. విద్యార్థులకు అర్థమయ్యేలా భోధించడంలోనే విద్యార్థుల భవిష్యత్తు ఆధారపడి ఉంటుందన్నారు. శిక్షణలో నేర్చుకున్న వాటిని పాఠశాలల్లో అమలు చేయాలన్నారు. విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి పాటుపడాలన్నారు. పాఠశాలలను ప్రగతివైపు నడిపించాలన్నారు. ఇందుకు అవసరమైన నైపుణ్యాలు, సాధనాలను విద్యాశాఖ అందిస్తోందన్నారు. అందులో బాగమే ఈ శిక్షణ కార్యక్రమాలన్నారు. నాయకత్వమనేది విజయసాధనలో కీలకమన్నారు. అన్ని ప్రభుత్వ వ్యవస్థల కన్నా విద్యా రంగం ప్రాముఖ్యమైనదన్నారు. విద్యార్థుల ఉన్నత స్థాయికి చేరితే అది రాష్ట్ర, దేశాభివృద్ధిలో భాగమని గుర్తించాలన్నారు. గురువులు విద్యార్థులకు వెలుగు చూపే వారన్న విషయాన్ని మరువరాదన్నారు. వారిలో జ్ఞాన తృష్ణను రగిలించాలన్నారు. ఎప్పటికప్పుడు స్వీయ పరిశీలన చేసుకుంటూ ఉపాధ్యాయులు నిబద్ధత, అంకితభావంతో పనిచేస్తూ వృత్తి గౌరవాన్ని ఇనుమడింపజేయాలని కోరారు.

# ఘనంగా వినాయక నిమజ్జనం



మదనపల్లె సిటీ: నిమజ్జనానికి తరలిస్తున్న వినాయక విగ్రహం

మదనపల్లె సిటీ: వినాయకచవితిని పురస్కరించుకుని వాడవాడలా ప్రతిష్టించిన గణనాథుల విగ్రహాల నిమజ్జనాన్ని మదనపల్లె పట్టణంలో ఆదివారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. ప్రశాంత్‌నగర్, నెహ్రూనగర్, వాల్మీకివీధి, అప్పారావుతోట, సొసైటీకాలనీ, ఈశ్వరమ్మకాలనీ ప్రాంతాల్లో వినాయకుని విగ్రహాలను పట్టణ పురవీధుల్లో ఊరేగించారు. మంగళవాయిద్యాలు, వేదమంత్రోచ్చరణాలు, భజనలు, కోలాటాలు, బళ్ళారి డ్రమ్ములు, డీజెలతో ఊరేగింపులు నిర్వహించారు. అనంతరం సీటీఎం రోడ్డులని తట్టివారిపల్లె చెరువులో నిమజ్జన కార్యక్రమం చేశారు. పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

**వేలంలో రూ.50,116 పలికిన లడ్డూ:**

పట్టణంలోని ఎన్టీఆర్ సర్కిల్‌లో ఆదివారం నిమజ్జన కార్యక్రమంలో స్వామి ఎదుట ఉంచిన లడ్డూను వేలం పాట నిర్వహించారు. వేలం పాటలో మార్పురి వరణ్ రూ.50,116 లడ్డూను దక్కించుకున్నాడు.

**గుర్రంకొండలో..**

గుర్రంకొండ: మండలకేంద్రమైన గుర్రంకొండతో పాటు పలు గ్రామాల్లో వినాయక విగ్రహాల నిమజ్జనం కార్యక్రమ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆదివారం స్థానిక బలిజగడ్డ వీధిలో కొలువుదీర్చిన స్వామివారి విగ్రహాని వైభవంగా ఊరేగించారు. నృత్య కళాకారుల విన్యాసాలు ఊరేగింపులో అందర్ని ఆకట్టుకొన్నాయి. పలుచోట్ల అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం స్వామివారి లడ్డూ వేలం నిర్వహించారు. ఊరేగింపులో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ దిలీప్‌కుమార్ బందోబస్తు చర్యలు చేపట్టారు.

**బి.కొత్తకోటలో..**

బి.కొత్తకోట: వినాయక విగ్రహాల నిమజ్జనోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. నగర పంచాయతీ పరిధిలో వీధివీదినా విగ్రహాలను ప్రతిష్ఠించి వారంరోజులుగా పూజలు నిర్వహించారు. ప్రతిరోజూ భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ, అన్నదాన కార్యక్రమాలు జరిగాయి. స్థానిక పోకనాటివీధిలో ప్రతిష్ఠించి అతిపెద్ద వినాయక విగ్రహాన్ని మేళతాళాలు, బాణసంచా కాల్చుతూ పట్టణంలో ఊరేగింపుగా నిమజ్జనం పూర్తి చేశారు.

**కలికిరిలో..**

కలికిరి: పట్టణంలో ఏర్పాటు చేసిన గణపతి విగ్రహాలు భక్తులు కోలాహలంగా ఆనందోత్సాల మధ్య ఆదివారం నిమజ్జన కార్యక్రమం నిర్వహించారు. స్థానిక క్రాస్ రోడ్డులో ఏర్పాటు చేసిన విగ్రహం వద్ద వినయక లడ్డూ బహిరంగ వేలం నిర్వహించగా వైఎస్సార్‌సీపీ నాయకుడు, సీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ చైర్మెన్ సతీష్ రెడ్డి రూ.20,116కు దక్కించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన వినాయకునికి ప్రత్యేక పూజలు నిర్వహించి నిమజ్జన ఊరేగింపును ప్రారంభించారు. అలాగే ఆర్.ఎస్. రోడ్డు, కాలేజీ రోడ్డు తదితర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన విగ్రహాలను నిమజ్జనం చేశారు.

**రూ. 91,116 పలికిన లడ్డూ**

కురబలకోట: మండల కేంద్రం కురబలకోటలో ఆదివారం గణేష్ నిమజ్జనం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వినాయకుని లడ్డూను ఇదివరలో అంగళ్ల వీఆర్వోగా పనిచేసి ప్రస్తుతం రామసముద్రం మండలం కప్పల్లెలో పనిచేస్తున్న అంజికుమార్ రూ. 91,116కు వేలంలో దక్కించుకున్నాడు. వీఆర్వోను గ్రామస్థులతో పాటు ఉత్సవ కమిటీ అభినందించారు. అలాగే బసవన్న కట్ట యువత కలశం టెంకాయను రూ. 45 వేలకు, వినాయకుని పట్టు వస్త్రాలను ఈతకోటి మునిరాజ రూ. 40 వేలకు వేలంలో పొందారు.

**రూ. 1,62,116 లక్షలు పలికిన లడ్డూ**

పెద్దమండ్యం: మండల పరిధిలోని వెలిగల్లులో వినాయక విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన లడ్డూకు ఆదివారం వేలం నిర్వహించారు. పాటలో గ్రామస్థులు పోటీ పడ్డారు. పోటీలో వెలిగల్లుకు చెందిన నల్లపురెడ్డి విశ్వనాధరెడ్డి రూ. 1,62,116 లక్షలకు వేలంలో లడ్డూను దక్కించుకున్నారు. కోలాహలంగా గ్రామ పురవిధులలో ఊరేగించి విగ్రహం నిమర్జనం కార్యక్రమం నిర్వహించారు. నిమర్జనం సందర్భంగా వెలిగల్లులో ఎస్ఐ రామాంజనేయుడు బందోబస్తు ఏర్పాటు చేశారు.







కలికిరి : ఊరేగింపును ప్రారంభిస్తున్న సతీష్‌రెడ్డి, కురబలకోట : లడ్డూను దక్కించుకున్న వీఆర్వో అంజికుమార్ , పెద్దమండ్యంలో విశ్వనాథరెడ్డి

## సేవా కార్యక్రమాలను విస్తృతం చేద్దాం



మాట్లాడుతున్న క్రిష్ణమూర్తి

వాల్మీకిపురం: సమాజంలో నిరుపేదలను ఆదుకునేందుకే మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ అందిస్తున్న సేవలను మరింత విస్తృతం చేద్దామని ఆ సంస్థ జిల్లా అధ్యక్షులు క్రిష్ణమూర్తి అన్నారు. ఆదివారం స్థానిక భగవాన్ సత్యసాయి మందిరంలో మానవతా సంస్థ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలను ఆదుకునేందుకు మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందన్నారు. మానవుడిగా జీవితానికి పరిపూర్ణత చేకూరాలంటే కుటుంబం, స్వార్థం కాకుండా సమాజం కోసం సేవ చేయాల్సి ఉందన్నారు. ఇప్పటికే ఫ్రీజర్ బాక్సులు, వైకుంత రథం, రోడ్డు పక్కన బల్లలు ఏర్పాటు చేశామన్నారు. పచ్చదనం కార్యక్రమం కింద మొక్కలను నాటే కార్యక్రమాలను చేద్దామని పిలుపునిచ్చారు. అనంతరం మానవతా సంస్థ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో కేశవ రెడ్డి, లక్ష్మినారాయణ రెడ్డి, ఆనంద శెట్టి, పివి నారాయణ, కోనూరి చంద్ర, సివి రమణ, లక్ష్మన్న, కుమార్, మురళి, తదితరులు పాల్గొన్నారు.

**మదనపల్లె డివిజన్ పరిధిలో..**

మదనపల్లె సిటీ: మదనపల్లె డివిజన్ పరిధిలో మానవత సేవలు విస్తృతం చేస్తామని ఆ సంస్థ చైర్మన్ రాటకొండ గురుప్రసాద్ అన్నారు. ఆదివారం స్థానిక జ్ఞానాంబిక డిగ్రీ కాలేజీలో మానవత సంస్థ సమీక్షా సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ ప్రతి నెల ఉచిత వైద్య శిబిరం, కాలేజీలలో అవగాహన కార్యక్రమాలు చేస్తామన్నారు. వైకుంత రథం, ఫ్రీజర్ బాక్సులు అందుబాటు ఉంచినట్లు తెలిపారు. కావాల్సిన వారు చంద్రశేఖర్ 9848581535, నారాయణరెడ్డి 9441656535ను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో అధ్యక్షులు నారాయణరెడ్డి, ఉపాధ్యక్షులు ప్రసాద్‌రెడ్డి, సభ్యులు హరినాథ్, శిద్దయ్య, చంద్రశేఖర్, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.